క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయండి



అడుసుపాళెం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

రేణిగుంట: జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు ఆదేశించారు. మండలంలోని ఎల్లమంద్యం పంచాయతీ అడుసుపాళెం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిబాబు, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది

ఏర్పేడు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు సర్పంచ్ బుజ్జమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని కోబాక సచివాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు చెంగల్రాయులు, పంచాయతీ కార్యదర్శి లోకముని, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



కారిపాకంలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం స్థానిక సర్పంచ్ వేనాటి ఆనంద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్, డిజిటల్ అసిస్టెంట్ స్వప్న పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..



పీవీకండ్రిగలో రూ.2750 పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు

బుచ్చినాయుడుకండ్రిగ: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే పింఛన్ రూ. 2,500 నుంచి రూ. 2,750 లకు పెంచి ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని ఆలత్తూరు ఎంపీటీసీ వరలక్ష్మి, పీవీకండ్రిగ సర్పంచ్ కోటమ్మ, తెలిపారు. బుధవారం వారు పీవీకండ్రిగలో పింఛనుదారులకు పెన్షన్ పంపిణీ చేసి మాట్లాడారు.

ఈ రోజు

పెన్షన్ పెంపు వారోత్సవాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు పెన్షన్‌పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. అలాగే గ్రామ సచివాలయ నిధులతో వేసిన సీసీరోడ్డును ప్రారంభిస్తారని తెలియజేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక ఆర్ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ నూతన పెన్షన్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేస్తారని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఎంపీడీవో ప్రేమ్ రాజ్‌ఉమార్ సారథ్యంలో ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో 1,274 కొత్త పింఛన్లు మంజూరు చేశారని, వీటిలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం 253, శ్రీకాళహస్తి మండలం 266, తొట్టంబేడు 208, రేణిగుంట 287, ఏర్పేడు 260 పింఛన్ల చొప్పున ఉన్నట్టు వివరించారు.

వాహనాల వేలం

సత్యవేడు: పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 41 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను బుధవారం ఉదయం 10 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎస్ఐ పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.1000 డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

మాడవీధి ఉత్సవంలో ఉభయనాంచారులతో కల్యాణ వెంకన్న



ఉత్తరముఖ ద్వారం నుంచి వస్తున్న భక్తులు



ద్వాదశి ద్వారోత్సవం

నారాయణవనం: ద్వాదశిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తరముఖ ద్వారంలో గోవిందనామ స్మరణల మధ్య స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం వేకువ జామున 3 గంటలకు తిరుప్పావైతో స్వామి వారిని మేల్కొలిపి అర్చకులు ధనుర్మాస పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. 5 గంటలకు ద్వాదశి ప్రత్యేక తిరుమంజనం అనంతరం అర్చకులు ఆలయంలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఉభయ నాంచారులతో స్వామి వారు తిరుచ్చి వాహనంపై 7.30 గంటలకు మాడవీధుల్లో భక్తుల నుంచి హారతులు అందుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. 8.15 గంటలకు ద్వాదశి గడియల్లో ఆలయ అంతర ప్రాకారంలోని ఉత్తరముఖ ద్వారంలో ప్రవేశించి కొలువుదీరారు. సర్కారు హారతి అనంతరం ప్రముఖులకు ద్వార ప్రవేశం కల్పించారు. స్థానిక టీటీడీ ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారులు నాగరాజు, ఆలయ భద్రతా జమేదార్ విజయకుమార్,



ద్వాదశి ద్వారోత్సవంలో ఎమ్మెల్యే ఆదిమూలం, డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు

రూరల్ సీఐ సురేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోండా పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి డీఆర్వో శ్రీనివాసరావు, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉత్తరముఖ ద్వారా ప్రవేశం చేసి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. మూలవర్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆలయ మర్యాదలను అందుకున్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించండి

నారాయణవనం: గ్రామీణ ప్రాంతాలలో ప్రజారోగ్యం విషయంలో శ్రద్ధ వహించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ అరుణసులోచనాదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలవారీ ఆశా డే సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. లెప్రసీ, క్షయ తదితర రోగాలను ప్రారంభ దశలోనే గుర్తించి రోగులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. పేదలు, మహిళలు, చంటి పిల్లలు, కిశోర బాలికలను ఆరోగ్య సూత్రాలపై చైతన్యవంతుల్ని చేయాలన్నారు. గత నెల 15వ తేదీ నుంచి చేస్తున్న ఎల్‌సిడిసి సర్వేను గురువారం లోపు పూర్తి చేసి తప్పులు లేకుండా నివేదికలు రూపొందించి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ దర్శిత్‌రాజ్, రాగసుధ, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప జిల్లా వైద్యాధికారి అరుణసులోచనాదేవి

మోటార్ సైకిల్ ఎవరిదో?

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఓ మోటార్ సైకిల్ (ఏపీ 39 సీసీ 4428) రెండు వారాలుగా ఉంది. ఇది ఎవరిదో, ఎందుకు ఇక్కడ వదలి వెళ్లారో, ఒకవేళ చోరీ చేసిన బైకా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని ఎవరూ తీసుకుని వెళ్లకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



మేర్లపాక వద్ద ఉన్న ద్విచక్ర వాహనం

జిల్లా మహాసభ విజయవంతం చేయండి

వరదయ్యపాళెం: ఆశా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న పుత్తూరులో నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఏఐటీయూసీ సభ్యుడు తరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా మహాసభకు సంబంధించి ఆశా వర్కర్లతో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగార్జున, వాణి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్లు

చీరల పంపిణీ

తిరుపతి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జ్ఞానాంబవారి మధురెడ్డి, బుజ్జిరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, చింతకాయల సుధాకర్ రెడ్డి, మునికృష్ణారెడ్డి, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూలులో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని తల్లిదండ్రుల కమిటీ తనిఖీ చేసింది. ఆ కమిటీ అధ్యక్షుడు ఆర్కాడు శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పౌష్టికాహారాన్ని పెడుతున్నారని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తల్లిదండ్రుల కమిటీ

చేపల చెరువు వేలం



చేపల చెరువు వేలం నిర్వహిస్తున్న మంజుల

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం పంచాయతీకి చేపల చెరువు వేలంలో రూ.2.41 లక్షలు ఆదాయం లభించింది. మంగళవారం సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో చేపల చెరువుకు వేలం వేశారు. గ్రామానికి చెందిన కొంగర మునిరెడ్డి వేలంలో చేపల చెరువును దక్కించుకున్నాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఫీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

సత్యవేడు: మహిళా–శిశు సంక్షేమ శాఖ సత్యవేడు ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ టీచర్, 14 హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ దేవకుమారి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 7వ తేదీ లోపు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు. నాగలాపురం మండలం సురుటుపల్లె అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు(డీసీ–డి) కేటాయించారు.హెల్పర్ పోస్టులకు సంబంధించి మండలంలో రామచంద్రపురం(ఎస్టీ), ఇరుగుళం1(ఓసీ), రాచపాళెం (బీసీ–బి), గొల్లవారిపాలెం(ఎస్సీ) వరదయ్యపాళెం మండలంలో లక్ష్మీపురం1(బిసి–డి), లక్ష్మీపురం2(బీసీ–ఈ), కదూరు(ఎస్సీ), వెంగారెడ్డి కండ్రిగ(ఎస్సీ), సంతవేలూరు హెచ్‌డబ్ల్యు(ఎస్సీ), బీకే బేడు(ఎస్సీ), ఎస్ఎస్‌పురం(ఎస్టీ) కేటగిరి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సీడీపీఓ వివరించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



ఏర్పేడులో..



వరదయ్యపాళెం : గోవర్ధనపురం ప్రాథమిక పాఠశాలలో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, ఏర్పేడు జెడ్పీ హైస్కూళ్లలో మంగళవారం ఆదర్శ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు ఆమె సేవలను స్మరించారు. కార్యక్రమంలో ఆదర్శ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లి గురునాథం, సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు సుబోస్, మురళి, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని గోవర్ధనపురం ప్రాథమిక పాఠశాలలో స్థానిక డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి పూలే దంపతుల త్యాగాలు, బడుగు బలహీన వర్గాలకు అందించిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, డైనమిక్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగప్రసాద్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, డైనమిక్ సభ్యులు రామసుబ్బయ్య, గోపి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంటలో..

రేణిగుంటలో..

రేణిగుంట: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం రేణిగుంటలోని ఆషా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిందన్నారు. విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని విశ్వసించి 1848లో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. ఆమె సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారు అమ్ములురాజు, కమిటీ సభ్యులు రమేష్, మునీంద్ర, విజయ పాల్గొన్నారు.

అన్నింటా అభివృద్ధే ధ్యేయం



సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- చియ్యవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తన ధ్యేయమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని చియ్యవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత గ్రామంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయ, లేదా? అని ఆరా తీశారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్ ద్వారా వివరించి అందజేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నవరత్నాల సంక్షేమ ఫలాలు పార్టీలకతీతంగా అందిస్తున్నామన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నపక్షంలో పార్టీ కార్యాలయంలో కూడా తెలియజేయవచ్చన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ, కొందరు పింఛన్ల సమస్యను ఎమ్మెల్యేకు నివేదించారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసునాయుడు, మోహన్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, చియ్యవరం సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ వేమాలయ్య, సచివాలయ కన్వీనర్లు రఘురామయ్య, సురేఖ, గంగాధర్‌రెడ్డి, అలంకారయ్య, పెంచలయ్య, ముని, కోటి, శ్రీను, వెంకటేష్, గెరటారెడ్డి, ఢిల్లీబాబు, భాస్కర్, గంగాధరం, ముని, చింతా రాజేంద్ర, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, డీటీ సుధీర్‌రెడ్డి, ఎస్ఐ రాఘవేంద్ర, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



చిన్నారిని ఎత్తుకుని చిరునవ్వుతో ఎమ్మెల్యే

16 నుంచి ముఖ ఆధారిత హాజరు

సత్యవేడు: ఈ నెల 16 నుంచి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎంపీడీఓ బాల గణేషన్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ బేస్డ్ అటెండెన్సు యాప్‌ను తప్పనిసరిగా అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, రోజు పది సర్వీసులు రిజిస్టర్ చేయాలన్నారు. జగనన్న కాలనీలలో పనులు వేగవంతం చేసి సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. రోజువారీ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండాలనన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ శివయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాల గణేషన్

కృష్ణాపురం చెరువు గండికి మరమ్మతులు



చెరువు కట్టకు పడిన గండి



జేసీబీతో గండికి చేస్తున్న మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో గత నెల తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలకు కృష్ణాపురం చెరువు కట్టకు పడిన గండిని సర్పంచ్ కోటమ్మ, మండల వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌పాల్ మరమ్మతులు చేయించారు. అప్పట్లో చెరువు కట్టకు గండికి గ్రామస్తులు, రైతులు నామమాత్రపు మరమ్మతులు చేశారు. గండి మూలాన చెరువులోని నీరంతా పొలాలపై ప్రవహించడంతో 50 ఎకరాల్లోని వరిపంట కొట్టుకుపోయింది. దీంతో సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం. చెరువు నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో మంగళవారం మరమ్మతులు చేయించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలా నాగిరెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణగోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. తొలుత ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్న అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



రాహుకేతు పూజల్లో తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మీరెడ్డి

క్యాలెండర్ల ఆవిష్కరణ

నారాయణవనం: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఏపీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ భారతి ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు మావిళ్లయ్య, కుప్పయ్య, కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.



హాకీ క్రీడా సామగ్రి పంపిణీ

గూడూరురూరల్: విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడాభివృద్ధికి సీనియర్ హాకీ క్రీడాకారుడు, పగడాలపల్లి సర్పంచ్ పి.వెంకటేశ్వర్లునాయుడు దాతృత్వంతో హాకీ స్టిక్స్, బాల్స్, కోన్స్‌ను అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్.ఎం. జయరామనాయుడు ఆధ్వర్యంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు నాయుడు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. హాకీ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి.స్వర్ణన్‌రాజ్, ట్రెజరర్ ఎం.అశోక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్.కె.నజ్మా, పీడీ కరిముల్లాఖాన్, ఉపాధ్యాయులు సురేష్, జోసెఫ్, రఘురామ్ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్

ప్రతి ఒక్కరికీ అవగాహన

నాయుడుపేటటౌన్: ప్రభుత్వం మహిళలతో పాటు శిశు సంక్షేమం కోసం ప్రవేశ పెడుతున్న వినూత్న పథకాలను గ్రామాల్లో అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని తిరుపతి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ విజయలక్ష్మి పేర్కొన్నారు. నాయుడుపేట ప్రాజెక్టు కేంద్రంలో మంగళవారం పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాలలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల కార్యాకర్తలతో జరిగిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సంపూర్ణ పోషక పథకం, బాలమృతాం ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. సీడీపీఓ జ్యోతి, వైద్యులు ప్రవల్లిక, నిత్యప్రశాంతి, మౌనిక రెడ్డి, ఎస్‌బీసీసీ కిషోర్, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్లు సాయిలత, మణెమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.